Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 229 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
మంగళవారం, 21 - 4 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## పీఎం శ్రీ హెలి సర్వీస్‌లో భాగంగా ఓర్చాకు పుష్పక విమానం ప్రారంభం : ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్






**న్యూఢిల్లీ :** రాష్ట్రంలో పర్యాటకం, మతపరమైన యాత్రలను సులభంగా, సురక్షితంగా, ఆనందదాయకంగా మార్చడమే హెలి టూరిజం సర్వీస్ లక్ష్యం. మధ్యప్రదేశ్ విమానయాన విధానాన్ని అనుకరించడానికి అనేక రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయి. పర్యాటకం ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడమే కాకుండా ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తుంది. 'పీఎం శ్రీ హెలి టూరిజం సర్వీస్' కింద కొత్త విభాగమైన భోపాల్-చందేరి-ఓర్చా హెలికాప్టర్ సర్వీస్‌ను ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ ప్రారంభించారు. శ్రీ పరశురామ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం రాజధానిలోని స్టేట్ హ్యాంగర్‌లో జరిగింది. ఓర్చాలో రాజుగా కొలువై ఉన్న శ్రీరాముడిని దర్శించుకునేందుకు సందర్శకులకు వీలు కల్పించేందుకు, పీఎం శ్రీ హెలి సర్వీస్‌లో భాగంగా ఓర్చాకు పుష్పక విమానాన్ని ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ తెలిపారు. పవిత్రమైన పరశురామ జయంతి సందర్భంగా, మధ్యప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక చారిత్రాత్మక అడుగు వేస్తోంది. భోపాల్-ఓర్చా మరియు చందేరి సెక్టార్ల కోసం 'పీఎం శ్రీ హెలి టూరిజం సర్వీస్'ను ఈరోజు ప్రారంభిస్తున్నారు. ఈ సర్వీస్‌ను ప్రారంభించిన ఈ రెండు నగరాలు రాష్ట్రంలోని వారసత్వ ప్రదేశాలు. చందేరికి శ్రీరాముడు, శ్రీకృష్ణుడితో కూడా సంబంధం ఉంది. చందేరి ఒక పౌరాణిక, ఆధ్యాత్మిక, చారిత్రక మరియు పర్యాటక నగరంగా ప్రసిద్ధి చెందింది. మహారాష్ట్రతో సహా అనేక రాష్ట్రాలు, మధ్యప్రదేశ్ యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగం నుండి స్ఫూర్తి పొందుతున్నాయి. ఆదివారం రాజధానిలోని స్టేట్ హ్యాంగర్ నుండి 'పీఎం శ్రీ హెలి టూరిజం సర్వీస్' కింద కొత్త సెక్టార్ అయిన "భోపాల్-చందేరి-ఓర్చా" ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లను పంపిణీ చేసి, హెలికాప్టర్‌ను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో పర్యాటకం మరియు మతపరమైన ప్రయాణాలను సులభంగా, సురక్షితంగా మరియు ఆనందదాయకంగా మార్చడమే హెలి టూరిజం సర్వీస్ యొక్క లక్ష్యం. ఈ కార్యక్రమానికి నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి మరియు అశోక్ నగర్ ఇన్‌చార్జ్ రాకేష్ శుక్లా, భోపాల్ మేయర్ మాల్తీ రాయ్, మరియు పై ఓలాకు చెందిన ఎస్.రామ్ ఓలా హాజరయ్యారు. విశ్వాసం, ధైర్యం, పట్టుదల, శౌర్యం, జ్ఞానం, ఉదారత మరియు ఉత్తమ గుణాలు కలిగిన పరశురాముడు ఎల్లప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారని ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ అన్నారు. ధైర్యం, శౌర్యం మరియు పట్టుదలలో కొత్త రికార్డులు సృష్టించిన పరశురాముడు యుగయుగాలుగా మనకు స్ఫూర్తినిస్తూనే ఉంటారు. అటువంటి దైవపురుషుని జయంతి సందర్భంగా, పి.ఎం. శ్రీ హెలి టూరిజం సర్వీస్‌ను రాష్ట్రానికి అంకితం చేస్తున్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా సేవ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ పేర్కొన్నారు. చికిత్స అవసరమైన వారికి పి.ఎం. శ్రీ ఎయిర్ అంబులెన్స్ సేవను ప్రారంభించిన దేశంలోనే మొదటి రాష్ట్రం మధ్యప్రదేశ్. మధ్యప్రదేశ్ విశాలమైన భౌగోళిక ప్రాంతాన్ని కలిగి ఉంది మరియు మత, సాంస్కృతిక, వన్యప్రాణి మరియు పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలను అందిస్తుంది. రవాణా పరంగా చూస్తే, హెలి టూరిజం సేవ పర్యాటకుల సమయాన్ని ఆదా చేయడంతో పాటు, ప్రయాణ ఆనందాన్ని పెంచుతుంది.

ఇది రాష్ట్రంలో పర్యాటక కార్యకలాపాలను విస్తరిస్తుంది. ఈ కార్యకలాపాలను ప్రోత్సహించడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు దానంతట అవే ఉత్తేజితమై, కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. పర్యాటకాన్ని ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రాధాన్యత. రాష్ట్రవ్యాప్తంగా విమాన సేవలను విస్తరించారు. రైలు, బస్సు, రోడ్డు రవాణాతో పాటు జల రవాణాపై కూడా పనులు జరుగుతున్నాయి. పర్యాటక కార్యకలాపాలను ప్రోత్సహించి, పర్యాటక ప్రదేశాలకు ప్రయాణాన్ని సులభతరం చేస్తున్నందుకు మధ్యప్రదేశ్ పర్యాటక శాఖను ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ అభినందించారు. ఓంకారేశ్వర్-మహాకాలేశ్వర్-ఇండోర్ సెక్టార్ మరియు కన్హా-బంధవ్‌గఢ్-మైహర్‌కి మాతాజీ-అమర్‌కంటక్-చిత్రకూట్‌లలో హెలి-టూరిజం సేవలను మొదట ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ తెలిపారు. హెలి-టూరిజం సేవ యొక్క మూడవ సెక్టార్ ఈరోజు ప్రారంభమవుతోంది. ప్రధానమంత్రి శ్రీ హెలి-టూరిజం సర్వీస్ కింద, చందేరి నుండి ఓర్చాకు ఛార్జీలు 2,750, భోపాల్ నుండి చందేరికి 5,500, మరియు భోపాల్ నుండి ఓర్చాకు 6,500గా ఉన్నాయని ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ తెలిపారు. భోపాల్ నుండి ఓర్చా ప్యాకేజీకి 14,500 ఖర్చవుతుంది, ఇందులో హెలికాప్టర్ ఛార్జీకి 13,000, టాక్సీ ఛార్జీకి 1,150, మరియు దర్శనం, ప్రసాదం కోసం 350 ఉంటాయి. ఈ యాత్ర నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గణనీయమైన మొత్తంలో మ్యాచింగ్ గ్రాంట్ అందిస్తోందని ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక కార్యకలాపాలను ప్రోత్సహించడం మరియు మధ్యప్రదేశ్‌పై పర్యాటకుల ఆసక్తిని పెంచడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ మ్యాచింగ్ గ్రాంట్‌ను అందిస్తోంది. భోపాల్ PMSHRI ఫస్ట్ టూరిజం సర్వీస్ యొక్క కొత్త సెక్టార్ "భోపాల్-చందేరి-ఓర్చా"లోని మొదటి ప్రయాణీకులైన శ్రీ అభిదేశ్ ప్రసాద్ శుక్లా, రేవతి శుక్లా మరియు రామశంకర్ శుక్లాలకు ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్ బోర్డింగ్ పాస్‌లను అందజేశారు. ఈ యాత్ర కోసం ఆధునిక ఆరు సీట్ల హెలికాప్టర్‌ను ఉపయోగిస్తారని ప్రకటించారు. పర్యాటకులు https://www.flyola.in/ మరియు IRCTC పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమానికి ముందు, ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్‌కు జ్ఞాపికను బహూకరించి స్వాగతం పలికారు.





**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ఉదయం ముఖ్యమంత్రిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.**

## ఉయ్యాలవాడ విగ్రహాన్ని నిర్మించాలని వినతి

**బాపట్ల, (రాజధాని వార్తలు):** బ్రిటిష్ పాలకుల నిరంకుశత్వాన్ని ఎదురొడ్డి భారత స్వాతంత్ర ఉద్యమానికి పురుడుపోసిన స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని బాపట్లలో స్థాపించి ఆయనను స్మరించుకోవాలని కోరుతూ ఓరుగంటి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ద్వారం వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఓరుగంటి రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు మున్నం భోగేశ్వర్ రెడ్డి, సంఘం నాయకులు కావూరు వెంకటరమణారెడ్డి, ఆసోది వెంకట స్వామి రెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలిసి బాపట్లలో అనువైన స్థల పరిశీలన చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున కొంత మేర నిధులు అందించాలని, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రను భావితరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్థల వితరణ చేస్తే, సంఘం నుంచి కొంతమేర నిధులు సమకూర్చి సత్వరమే ఉయ్యాలవాడ విగ్రహాన్ని స్థాపించి అందరూ స్మరించుకునేలా



చేస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉయ్యాలవాడ విగ్రహాల స్థాపనకు నడుం బిగించిన రెడ్డి సంఘాల పిలుపు మేరకు ప్రతి జిల్లాలో కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నట్లు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓరుగంటి సంక్షేమ సంఘం నడుం బిగించి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాలను స్థాపించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.











**తమిళనాడు రాష్ట్రం థలి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

## భూగర్భ జలశాఖ సంచాలకులుగా కె.ఎస్.శాస్త్రి నియామకం

### - నేడు బాధ్యతలు స్వీకరించిన నూతన డైరక్టర్ కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి



**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్ర భూగర్భ జలశాఖ, జలగణన శాఖ నూతన సంచాలకులుగా కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ శాఖలో సంయుక్త సంచాలకులుగా సేవలందిస్తున్న కె.ఎస్.శాస్త్రికి పదోన్నతి కల్పించి సంచాలకులుగా నియమిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఈనెల 16న ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు విజయవాడలోని హనుమాన్ పేటలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన సంచాలకులుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. భూగర్భ జల శాఖలో అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్, సహాయ సంచాలకులు, ఉపసంచాలకులు, సంయుక్త సంచాలకులు తదితర వివిధ హోదాల్లో ఆయన గత 34 సంవత్సరాలుగా పనిచేసి ఎన్నో ముఖ్యమైన ప్రాజెక్టులు రూపొందించడంలో కీలకపాత్ర వహించారు. రాష్ట్రంలో ఫీల్డ్ హైడ్రో జియోలాజికల్ సర్వేల నిర్వహణ, ఏపి గ్రేస్ వంటి వెబ్ ఆధారిత సాఫ్ట్ వేర్ తయారీలో ముఖ్యపాత్ర నిర్వహించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు -1, 2 అమలు వంటి ప్రాజెక్టులను అమలు చేసేందుకు కృషి చేశారు.

# స్మార్ట్ టీవీలు ఐ. ఎఫ్. పి.ల ద్వారా పూర్తిస్థాయి డిజిటల్ విద్యాబోధన





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ బడులలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచాలనే ఏకైక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మనబడి–జ్ఞానబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నెల్లూరు అర్బన్ మండలంలోని నెల్లూరు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల కృష్ణ మందిరంనందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు అర్బన్ మండల విద్యాశాఖ అధికారి బోయిళ్ళ తిరుపాలు మాట్లాడుతూ అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేస్తూ స్మార్ట్ టీవీలు ఐ.ఎఫ్.పిల ద్వారా పూర్తిస్థాయి డిజిటల్ విద్యా బోధన అందిస్తున్నటువంటి ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని ఐదవ తరగతి పూర్తి చేసుకున్నటువంటి ప్రతి ఒక్క విద్యార్థి ని 6వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే చేర్పించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించడం జరిగింది. నెల్లూరు డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించాలంటే అది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే సాధ్యమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారిని ఒప్పించి కృష్ణ మందిరం పాఠశాలలో ప్రస్తుతం ఐదో తరగతి పూర్తి చేసుకున్న 69 మంది విద్యార్థులను స్థానిక గవర్నమెంట్ మోడల్ హై స్కూల్ సంతపేట నందు మరియుూచీవీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల జండా విధి నందు చేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ మోడల్ హై స్కూల్ సంతపేట ప్రధానోపాధ్యాయులు అంబటి దయాకర రావు. కృష్ణ మందిరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాజా రహంతుల్లా. ఎస్ఎంసి చైర్మన్ ఎస్ సురేష్, మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు 5వ తరగతి పూర్తి అయిన విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ శ్రీకాంత్ రెడ్డి పెద్దమ్మ వేనాటి మనోహరమ్మని పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు షైన్ హాస్పిటల్లో అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతున్న 16వ డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి పెద్దమ్మ వేనాటి మనోహరమ్మని వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్చార్జి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి.. మనోహరమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

# హైకోర్టు ప్రోటోకాల్ జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్.పి. డా.అజిత వేజెండ్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గౌరవ జస్టిస్ హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మరియు నెల్లూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కే. సురేష్ రెడ్డి నెల్లూరు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లాలో అన్ని కోర్టుల న్యాయ అధికారులకు డిస్ట్రిక్ట్ కోర్టులో వర్క్షాప్ మరియు కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి. డా. అజిత వేజెండ్ల, ఐపిఎస్, గౌరవ జస్టిస్ కే.సురేష్ రెడ్డిని జిల్లా కోర్టు సముదాయం వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే, జిల్లా స్థాయిలో న్యాయ మరియు పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడానికి పోలీస్ శాఖ తరపున తీసుకోవలసిన చర్యలపై సంక్షిప్తంగా చర్చించి, గౌరవ జడ్జి నుంచి విలువైన సూచనలు పొందారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జడ్జి జి.శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఐఏఎస్ మరియు ఇతర న్యాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్పోలో ఆదరించాలి

## - రూరల్ ఎమ్మెల్యే సతీమణి కోటంరెడ్డి సుజితా రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక మినీ బైపాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న జిపిఆర్ కళ్యాణమండపంలో నిర్వాహకులు ఏర్పాటు చేయబడిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్పోను సందర్శించి ఆదరించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సతీమణి కోటంరెడ్డి సుజితా రెడ్డి పిలుపునిచ్చారు. ఎక్స్పో ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని శనివారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కళాకారులు మధునాతన కళా నైపుణ్యంతో రూపొందించిన వివిధ వస్త్రాలను సింహపురి మహిళలు కొనుగోలు చేసి భారతీయ సాంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈనెల 23 వరకు నిర్వహించనున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్పోలో పోచంపల్లి, గద్వాల్, కలంకారి, కాంచీపురం, వెంకటగిరి, ఉప్పాడ తదితర ప్రాంతాలకు చెందిన చేనేత కళాకారులు ఏర్పాటు చేయబడిన గ్యాలరీలను సందర్శించి తమకు ఇష్టమైన వస్త్రాలను కొనుగోలు చేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎక్స్పో నిర్వాహకులు వై శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వ హోలీ మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో ఇప్పటికే రెండుసార్లు ఎక్స్పోను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. నేటి నుండి ఈనెల 23 వరకు నిర్వహించనున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్పోలో మహిళలకు అధునాతనమైన వివిధ వస్త్రాలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అవకాశాన్ని సింహపురి మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

# రామయ్యా.. ఏంటి నీ మాయ! అచ్చం అయోధ్యనే నెల్లూరుకు దించేశారుగా

- ఇది కదా అసలైన జాతర.. వంద మంది కళాకారుల విశ్వరూపం, నెల్లూరులో రాముడి విశ్వరూపం - నెల్లూరు జనానికి పూనకాలే.. ఫ్రీగా రామ మందిర దర్శనం, కళ్ళు చెదిరే భారీ అమ్యూజ్మెంట్ రైడ్స్ - చూడడానికి రెండు కళ్లు చాలవు.. మిస్ అయితే లైఫ్ లాంగ్ తీరని వెలితి.. నెల్లూరులో అయోధ్య చర్చ - షాకింగ్ ధర.. అదిరిపోయే మజా..కేవలం 100 తో నెల్లూరులో అయోధ్య ట్రిప్ - దర్శనం ఉచితం.. వినోదం అద్భుతం.. 60 రోజుల పాటు నెల్లూరు జాతరను కళ్లారా చూడండి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సింహపురి చరిత్ర పుటల్లో మునుపెన్నడూ చూడని విధంగా, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతిరూపంగా సాక్షాత్తు ఆ అయోధ్య రామ మందిరమే మన నెల్లూరు గడ్డపై కొలువుదీరింది..నగరంలోని ఎన్టీఆర్ నగర్ ఎస్ వి జి ఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ పట్టాభి, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్ ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలలో ఎవరూ ఊహించని రీతిలో, కోట్లాది రూపాయల వ్యయంతో, వంద మంది అద్భుత శిల్పుల చేతుల్లో అరవై రోజుల పాటు ప్రాణం పోసుకున్న ఈ మహా కట్టడం అచ్చం అయోధ్యనే తలపిస్తూ భక్తులను పరవశింపజేస్తోంది. రామ మందిర దర్శనాన్ని భక్తులందరికీ పూర్తిగా ఉచితంగా అందిస్తూ, కేవలం 100 ప్రవేశ రుసుముతో మునుపెన్నడూ చూడని భారీ అమ్యూజ్మెంట్ రైడ్స్ మరియు విభిన్నమైన వాణిజ్య స్టాల్స్తో ఈ ఎగ్జిబిషన్ ఒక వినోదాల స్వర్గధామంగా మారింది. సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వృద్ధులకు, కుటుంబాలకు ఆ రామయ్య దర్శన భాగ్యాన్ని కల్పిస్తూ.. ఆధ్యాత్మికత మరియు వినోదాల అపూర్వ సంగమంగా నిలిచిన ఈ జాతర, రాబోయే అరవై రోజుల పాటు నెల్లూరు నగరంలో ఒక చిరస్మరణీయ వేడుకగా భాసిల్లబోతోంది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రతాప్ కుమార్ రెడ్డి, నౌషాద్, సాబీర్ ఖాన్, ఉస్మాన్, ముజ్జు, అబిద్, హయత్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో పెద్దఎత్తున ప్రజలందరూ పాల్గొనాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

## - స్వీయ గణనలో తన వివరాలు నమోదు చేసిన కలెక్టర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలో జనగణన కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్వీయ జనగణన ప్రక్రియలో భాగంగా తన కుటుంబానికి సంబంధించిన వివరాలను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. se.census.gov.in వెబ్సైట్ ద్వారా మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసిన కలెక్టర్, ప్రజలు కూడా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి కుటుంబం తమ ఇళ్లకు సంబంధించిన వివరాలను స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని తెలిపారు.దేశ జనాభా లెక్కలు సక్రమంగా నమోదు కావడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలు, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపనకు దోహద పడుతాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# నెల్లూరు రూరల్ నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ల నియామకం

- స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం - మరోసారి కార్పొరేటర్లుగా పోటీకి సై
- రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి సమక్షంలో సమావేశం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థలకు మరో నాలుగు నెలలు సమయం ఉండడంతో నెల్లూరు రూరల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. అందుకు అనుగుణంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జిలను నియమించారు. ప్రస్తుత కార్పొరేటర్లు 21వ డివిజన్ నుంచి మొయిళ్ళ గౌరీ, 29 నుంచి సత్తార్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీ సునంద, 31వ డివిజన్ నుంచి సుబ్బారెడ్డి, 28వ డివిజన్ నుంచి మదన్ మోహన్ రెడ్డి, 20వ డివిజన్ నుంచి మరో నాయకుడు వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తిని కనపరుస్తున్నారు. స్థానిక సంస్థల్లో పార్టీ కోసం పని చేస్తున్న వారిని బరిలోకి దింపాలని నిర్ణయించారు. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు చాలామందిని కార్పొరేటర్లుగా గెలిపించేందుకు కోటంరెడ్డి సోదరులు కష్టపడి పని చేశారు. గెలిచిన తర్వాత ఈ కార్పొరేటర్లో తాము వైఎస్ జగన్ ద్వారానే గెలిచామని అనేకసార్లు చెప్పుకుని వచ్చారు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బరిలోకి దిగి మరోసారి వీరి సత్తా ఏమిటో చూపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అలాగే రూరల్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పోటీ కూడా వైసిపి సన్నద్ధమవుతోంది.

# ఆడపడుచులకు సారెలు అందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

## - మహిళా ఉద్యోగినుల మధ్య ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు - మహిళలకు విపిఆర్ ఆత్మీయ పలకరింపు - సీఎం చంద్రబాబు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మహిళా ఉద్యోగులకు 'సారె' - ప్రజా సేవ చేయాలనే సంకల్పానికి అధికారం తోడైతే ప్రజలకు మరిన్ని సేవాకార్యక్రమాలు చేయవచ్చు : నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మహిళలకు చిరు కానుకగా సారెలను నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేసారు. ఈ వేడుకకు కోవూరు నియోజక వర్గ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వేలాది మంది మహిళా ఉద్యోగినులు తరలి వచ్చి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు పొందారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఎంపీ వేమిరెడ్డి కేక్ కట్ చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని శానిటేషన్, అంగన్వాడీ, మెడికల్, రెవెన్యూ, అగ్రికల్చర్, ఇంజనీరింగ్ వంటి అన్ని శాఖల మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికుల నుండి తహసీల్దార్ల వరకు, ఆశా వర్కర్ల నుండి వైద్యుల వరకు అందరూ ఒకే వేదికపైకి రావడం విశేషం.

ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రతి మహిళా ఉద్యోగినికి 'సారె' అందజేసి తన సోదరభావం చాటుకున్నారు. 20న సీఎం చంద్రబాబు జన్మదినం ఉన్న నేపథ్యంలో ప్రతి మహిళను గౌరవిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాల్లోకి వచ్చాక తన పుట్టినరోజును ఇంత మంది అక్కచెల్లెళ్ల మధ్య, ఒక కుటుంబ వాతావరణంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సేవ చేయాలనే దృఢ సంకల్పానికి అధికారం తోడైతే ప్రజలకు చేరువై మరిన్ని సేవా కార్యక్రమాలు చేయవచ్చనే లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఇకపై ప్రతి ఏటా నా జన్మదిన వేడుకలను ఇలాగే మహిళా ఉద్యోగినుల మధ్య జన్మదినం జరుపుకుంటానన్నారు.

**రేపటి నుంచి కోవూరులో విపిఆర్ నేత్ర సేవలు ప్రారంభం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని 20నుండి నుండి కోవూరు నియోజకవర్గంలో విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీ వేమిరెడ్డి చెప్పారు. గత ఏడాది నవంబర్ నుండి ఉదయగిరిలో సుమారు 40 వేల మందికి ఉచిత కంటి పరీక్షలు చేసి 22 వేల మందికి పైగా కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజక వర్గాలలో ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు అందివ్వాలన్న లేటెస్ట్ ఎక్యూప్మెంట్ వున్న రెండో మొబైల్ బస్సును కోవూరు నియోజకవర్గం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీ వేమిరెడ్డి వెల్లడించారు. కోవూరు ప్రజలు విపిఆర్ నేత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. తానూ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రజలకు చేరువై సేవ చేయగలుగుతున్నానంటే దానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగుల సహకారమే కారణమన్నారు. ఇంటిని, ఆఫీసును సమన్వయం చేసుకుంటూ విధి నిర్వహణ పట్ల మహిళా ఉద్యోగినుల అంకితభావం స్ఫూర్తిదాయకమన్నారు.

ఎంపీ వేమిరెడ్డి ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని, జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని అక్కడికి విచ్చేసిన మహిళలు ఆకాంక్షించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన వివిధ శాఖల మహిళా ఉద్యోగినులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినం దనలు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగినులకు ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చి సారెలతో చిరు సత్కారం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపి సీనియర్ నేతలు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఏటూరు హరి రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, చౌక చర్లమాజీ సర్పంచ్‌లు సమాధి శ్రీనివాసులు, కృష్ణవేణి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, అశోక్ రెడ్డి, ఇనమడుగు పెంచలయ్య, విన్నకోట రాఖీ, కోవూరు నియోజకవర్గం స్థాయి మహిళలు, నేతలు కార్యకర్తలు, తదితరులు పాల్గొని విపిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.

# లేగుంటపాడులో ఘనంగా వీపిఆర్ జన్మదినోత్సవ వేడుకలు



**కోవూరు, (రాజధాని వార్తలు):** మహా ప్రదాత నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు లేగుంటపాడులో అత్యంత ఘనంగా జరిగింది. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు ముత్యాల మోహన్ ఆధ్వర్యంలో పేదల పాలిటి పెన్నిధి మన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజల దాహార్తి తీర్చే కార్యక్రమంలో భాగంగా విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయి ఉన్న విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు విపిఆర్ అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ధార్మిక సేవా రంగాలలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. విపిఆర్ విద్యా, వైద్యం, వికాసం, ప్రజల దాహతి తీర్చే విపిఆర్ అమృత ధార, కంటి వెలుగు ప్రసాదించే విపిఆర్ నేత్ర ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి తెలుగుదేశం నాయకులు పోలంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి తదితరులు, స్థానిక కూటమి నాయకులు, తదితరులు ఉన్నారు.

# పొన్నపూడి లక్ష్మిపురంలో మన బడి - జ్ఞానబాటపై అవగాహన

## - ప్రధాన ఉపాధ్యాయురాలు అరుణమ్మ, సహాయ ఉపాధ్యాయురాలు కవిత





**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం ఆదేశాల మేరకు జరుగుతున్న బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొన్నపూడి లక్ష్మి పురం గ్రామంలో శనివారం మన బడి జ్ఞానబాట గురించి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు. జి.అరుణమ్మ, సహాయ ఉపాధ్యాయురాలు కవితలు పిల్లలకు అవగాహన కార్యక్రమం లను ర్యాలీని నిర్వహించడం జరిగింది. బడి ప్రాధాన్యతలను డ్రాఫ్ ఔట్స్ విద్యార్థులకు తెలిపారు. బడిలో చేర్పించే కార్యక్రమం లను నిర్వహించడం జరిగింది.

చదువు ద్వారా జ్ఞానం, విజ్ఞనంలను గ్రామంలోని పిల్లలకు వివరించారు. భవిష్యత్తులో చదువు వల్ల ఉపయోగాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, తల్లిదండ్రులు, పిల్లలు ఉన్నారు.

# పారదర్శకంగా పోలీసు సిబ్బంది బదిలీల ప్రక్రియ నిర్వహణ : జిల్లా ఎస్.పి. డా.అజిత వెజెండ్ల










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ ఐదు సంవత్సరాల సేవాకాలం పూర్తి చేసుకున్న పోలీస్ కానిస్టేబుల్ నుండి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు మరియు యస్పి సంపర్క్ కాల్స్ ద్వారా రిసీవ్ కాబడిన అభ్యర్థనలు మేరకు మొత్తం 212 మంది పోలీసు సిబ్బందికి, ఈ రోజు తేది 18 ఏప్రిల్ 2026న జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బదిలీల ప్రక్రియను జిల్లా ఎస్.పి. డాక్టర్ అజితా వెజెండ్ల, ఐపిఎస్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించారు. ఈ బదిలీల ప్రక్రియను జిల్లా అడిషనల్ ఎస్.పి. (అడ్మిన్) సిహెచ్ సౌజన్య సమర్థవంతంగా సమన్వయం చేసి, అన్ని విభాగాల నుంచి ఖాళీల వివరాలను సేకరించి, సిబ్బంది అభ్యర్థనలు మరియు అవసరాలను పరిశీలిస్తూ పారదర్శక విధానంలో నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ ప్రక్రియలో ఆయా పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీల ఆధారంగా, అర్హత కలిగిన సిబ్బందికి వారు కోరుకున్న ప్రదేశాలలో నియామకాలు కల్పించబడినట్లు అధికారులు తెలిపారు. బదిలీల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించబడటంతో సిబ్బందిలో సంతృప్తి వ్యక్తమైంది. ఈ సందర్భంగా బదిలీలలో పాల్గొన్న పోలీసు సిబ్బంది, తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకొని పారదర్శకంగా బదిలీల ప్రక్రియ నిర్వహించినందుకు జిల్లా ఎస్.పి. డాక్టర్ అజితా వెజెండ్ల, ఐపిఎస్‌కి మరియు అడిషనల్ ఎస్.పి. (అడ్మిన్) సిహెచ్ సౌజన్యకి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి.తో పాటు అడిషనల్ ఎస్.పి. (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, టౌన్ ఏ.ఎస్.పి./ఎస్.డి.పి.ఓ దీక్ష ఐపిఎస్, ఎస్.బి. డి.ఎస్.పి. వి.ధీరజ్ వినిల్, ఆత్మకూరు SDPO, ఏ.ఓ చంద్రమౌళి, సూపరింటెండెంట్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తోనే నేర నియంత్రణ సాధ్యం : సిఐ రోశయ్య



**డక్కిలి, (రాజధాని వార్తలు):** ప్రజల విశ్వాసం పొందడం ద్వారా మాత్రమే నేర నియంత్రణ సమర్థవంతంగా సాధ్యమవుతుందని వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ రోశయ్య పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడితో ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలని సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. శనివారం సాయంత్రం డక్కిలి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిఐ రోశయ్య, అక్కడి కేసుల ప్రగతిని సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలని, ప్రతి ఫిర్యాదును నిశతంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ తలుపులు తట్టే ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం కోసం వస్తారని, వారికి న్యాయం జరగాలంటే ముందుగా వారి మాటలను శ్రద్ధగా వినడం అవసరమని అన్నారు. ప్రజలతో సాన్నిహిత్యం పెంపొందించడం ద్వారా పోలీసులపై నమ్మకం పెరుగుతుందని, అదే నేరాల నివారణకు దోహదం చేస్తుందని వివరించారు. "ప్రజలు భయపడకుండా తమ సమస్యలను పోలీసులతో పంచుకునే వాతావరణం కల్పించాలి. అప్పుడే సమాజంలో జరిగే చిన్న పెద్ద ఘటనలపై సమయానుకూల సమాచారం అందుతుంది" అని తెలిపారు. అంతేకాకుండా, ప్రతి కేసును పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖ ప్రతిష్ట పెరుగుతుందని సిఐ పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన ధ్యేయమని, ఆ దిశగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట డక్కిలి ఇన్‌చార్జి ఎస్ఐ స్వరూప ఉన్నారు.

# నీటి బొట్టు–ఒడిసి పట్టు : డాక్టర్ చీదరాల చెన్నయ్య




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాళెం మండలం శనివారం నాడు "నీటిని ఆదా చేద్దాం...భవిష్యత్ తరాలకు అందిద్దాం" కార్యక్రమం ఆదర్శ ప్రాథమిక పాఠశాల పెనుబల్లి మెయిన్ నందు ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీదరాల చెన్నయ్య మాట్లాడుతూ నీటి వనరులను వృధా చేయకుండా తెలివిగా వాడుకొంటూ భవిష్యత్ తరాల కోసం నిల్వ చేయాలని, బ్రష్ చేసేటప్పుడు స్నానం చేసేటప్పుడు కుళాయిలను కట్టి ఉంచాలని, ఇంట్లో లీకౌతున్న పైపులను, కుళాయిలను రిపేరు చేయించాలని, వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చని అలాగే ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు పోయడం వల్ల నీరు త్వరగా ఆవిరి కాకుండా ఉంటుందని, కారగాయలు కడిగిన నీటిని మొక్కలకు పోయాలని, ఒక్క నీటి బిందువు విలువైనది! నీరు ప్రాణ ధనం. దానిని వృధా చేయకండి! అను నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ అల్లం శీనయ్య, మాధవరావు, బొట్టా భవాని, స్వీపర్ మీరమ్మ, విద్యార్థులకు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కేంద్ర సాహిత్య అకాడమీ అవసరమా?

ఏటా కేంద్ర సాహిత్య అకాడమి సాహిత్య పురస్కారాలు ప్రకటిస్తుంది. ఈ ఏడాది తెలంగాణ రచయిత నందిని సిధారెడ్డి 'అనిమేష'కు తెలుగు సాహిత్య పురస్కారం ప్రకటించింది. త్వరలోనే బాలసాహిత్య పురస్కారం, యువపురస్కారం ప్రకటించాల్సి ఉంది. వీటికి దరఖాస్తులు కోరుతూ గత ఏడాదిలోనే ఆహ్వానం ప్రకటించారు. అయితే తెలుగు రాష్ట్రాలలో 2014 తరువాత నెలకొన్న సామాజిక, సాహిత్య పరిస్థితులలో అసలు ఈ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు ఎంతవరకూ సాహితీవేత్తలను, ప్రజలను సంతృప్తిపరుస్తున్నాయన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొదటగా ఈ అవార్డులకు కేంద్ర సాహిత్య అకాడమీ ఇస్తున్న నగదు బహుమతిని పరిశీలిద్దాం. కేంద్ర సాహిత్య అకాడమి ప్రధాన పురస్కారానికి కేవలం లక్ష రూపాయలు, ఒక ప్రశంసా పత్రం, జ్ఞాపిక ఇస్తుంది. బాలసాహిత్య పురస్కారానికి, యువ పురస్కారానికి యాభైవేల రూపాయలు, ఒక రాగి పలకపై ప్రశంసా పత్రం, జ్ఞాపిక ఇస్తారు. కాబట్టి ధన/విలువ ప్రకారం పరిశీలిస్తే, ప్రధాన సాహిత్యానికిచ్చే విలువలో మిగతా రెండింటికీ సగమే ఇస్తున్నారు. ఈ వివక్ష దేని వల్లో ఎవ్వరికీ తెలియదు. ఈ పురస్కారాలకు అభ్యర్థులు పది కోట్ల జనాభా ఉన్న తెలుగు రాష్ట్రాల నుంచి వందల్లో ఉన్నారు. నిజానికి ఏ జాతీయ పురస్కారంగానీ లక్ష రూపాయల నగదుకు తక్కువ కాకుండా ఉండాలని ఒక అలిఖిత నియమం ఎప్పటినుంచో అమలులో ఉంది. కేంద్రానికి మూడు పురస్కారాలకు మూడు లక్షలు ఇచ్చే స్తోమత లేదా? ఇక ఈ పురస్కారాల ఎంపికకు అనుసరించే విధానం తల్చుకొంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఈ పురస్కారాలకు అభ్యర్థులు తమ పుస్తకాలను ప్రాంతాల వారీగా ఆయా కేంద్రాలకు స్వయంగా పంపాలి. పంపిన తరువాత అవి వారికి అందాయో లేదో కూడా తెలియపరిచే యంత్రాంగం అక్కడ లేదు. 'దేవుడికి ఉత్తరం' అన్న చందాన పంపిన నాటి నుంచి పురస్కార ప్రకటన వచ్చేవరకూ ఎదురు చూపులే దిక్కు. లాంగ్వేజ్ అడ్వైసరీ కమిటీ ఈ పుస్తకాల జాబితాను తయారు చేసి, వాటి పరిశీలనకు పది మంది ప్రాథమిక పరిశీలకుల/ పాఠకుల పేర్లను రాష్ట్రపతికి పంపుతుంది. రాష్ట్రపతి నియమించిన ఆ పరిశీలకులు/ పాఠకులు, వచ్చిన పుస్తకాలను చదివి ఒక్కొక్కరు రెండు పుస్తకాల చొప్పున తుది పరిశీలనకు సిఫార్సు చేస్తారట. ప్రతిసారీ ఆ పదిమంది ఎవరో ఎవరికీ తెలియదు. ఆ పదిమంది ప్రతిపాదించిన మొత్తం ఇరవై పుస్తకాలను రచయితల నుంచి గాని, ముద్రణదారుల నుంచి గాని అకాడమీ కొనుగోలు చేస్తుంది. ఈ ఇరవై పుస్తకాలను ముగ్గురు సభ్యుల న్యాయమూర్తులు పరిశీలిస్తారు. ఈ ముగ్గురు సభ్యులను తిరిగి లాంగ్వేజ్ అడ్వైసరీ కమిటీ సిఫార్సుల మేరకు రాష్ట్రపతే నియమిస్తారుట. సాహిత్య అకాడమీకి నియమితులైన తెలుగు భాషా కన్వీనర్ ఈ న్యాయమూర్తుల మీటింగ్ నిర్వహించి వారి ద్వారా ఆ వచ్చిన ఇరవై పుస్తకాలలో ఏదైనా ఒక దానిని పురస్కారానికి ప్రతిపాదించాలి. ఈ మీటింగ్ నిష్పక్షపాతంగా జరిగినట్టు ఆ కన్వీనర్ సంతృప్తి చెందితే చాలు. ఒకవేళ ఏ పుస్తకానికీ పురస్కార అర్హత లేకపోతే ఆ ఏడు దేనికీ అర్హత లేదని ఆ ముగ్గురు న్యాయమూర్తులు నిర్ణయించి, కన్వీనర్‌కు చెబితే ఆ ప్రకారమే తుది నిర్ణయం జరుగుతుంది. నిజానికి ఇదంతా అంత శాస్త్రీయంగా జరగటం లేదన్నది అనేక విధాల స్పష్టం. 2025 పురస్కారానికి ముగ్గురు సభ్యుల జ్యూరీ ముందుకు తుది పరిశీలనకు కేవలం ఏడుగురు రచయితల పుస్తకాలే వచ్చినాయి. 2026లో కూడా కేవలం పది పుస్తకాలే పరిశీలనకు వచ్చాయి. మరి ఇరవై పుస్తకాల మాటేమిటి? తెలుగు రాష్ట్రాలలో సుమారు రెండు వందల మంది బాలసాహిత్య రచయితలున్నారు. కొంతమంది చందమామ, బాలమిత్రతో రచనలు ఆరంభించి దాదాపు అన్ని బాల, దిన పత్రికలకు కథలు శరపరంపరగా రాశారు. ఇప్పటికీ రాస్తున్నారు. వీరిలో ఇద్దరి పేర్లు మాత్రమే ఆ ఏడుగురు రచనల లిస్టులో కనిపించాయి. అసలు మొత్తం ఎన్ని పుస్తకాలు వచ్చాయి? వాటిలోంచి ఎంపిక చేసేందుకు జ్యూరీకి ఇరవై పుస్తకాలు సరైనవని పించలేదా? అన్నీ సమాధానాల్లేని ప్రశ్నలే. రాజకీయాలకు, సిఫార్సులకు భయపడి గోప్యత పాటిస్తున్నారని పదిమంది నమ్మబలికే ప్రయత్నం చేసినా, గోప్యత మాటునే సిఫార్సులు నడుస్తున్నాయి. ఒకప్పుడు యూనివర్సిటీల్లో పనిచేసే కమ్యూనిస్టు మేధావులు, అభ్యుదయ రచయితల సంఘాల నాయకులు, బలమైన కులవర్గాల పలుకుబడి కేంద్ర సాహిత్య అకాడమీపై బాగా చెలామణీ అయ్యేది. ఆశ్చర్యం ఏమిటంటే కొడవటిగంటి కుటుంబరావు సుమారు ఐదువందల కథల దాకా రాశారు. కానీ ఆయనకు అవార్డు రాలేదు. ఆయన కథలకు సంపాదకుడిగా వ్యవహరించిన కేతు విశ్వనాథరెడ్డికి సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. చాసో, రావి శాస్త్రిలకూ రిక్తహస్తమే మిగిలింది. ప్రస్తుతంలో ఎనభయ్యో పడిలో పి.ఎస్. నారాయణ, విహారి, రాజా రామ్మోహన రావు, శ్రీకంఠస్ఫూర్తి లాంటి వాళ్ళున్నారు. మరి వీళ్ళెందుకు కనబడరు? పురస్కారాల సంఖ్య కూడా ఎటువంటి దామాషా, శాస్త్రీయత లేకుండా ఉన్నాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలన్న ప్రాతిపదిక ఏర్పడ్డాక జనాభా ప్రాతిపదికనో, రాష్ట్రానికొకటి అన్న ప్రతిపాదికనో ఉండాలి. రెండు తెలుగు రాష్ట్రాలకు ఒక్కటే పురస్కారం ఏవిధమైన న్యాయం? ఇంతమంది జనాభా ఉన్న ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి ఏటా ఒక్క అవార్డు ఇవ్వటం అంటే అవార్డు రాని ఆ స్థాయి హేమాహేమీలను కించపరచడమే. ఇది ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పథకాల, ప్రోత్సాహకాల ప్రదానం కూడా జనాభా నిష్పత్తిలోనో, ఆయా వర్గాల నిష్పత్తిలోనో ఉండాలి. 2011 జనాభా ప్రాతిపదికన పరిశీలిస్తే పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ఈ నాలుగు రాష్ట్రాలు మినహాయిస్తే మిగతా రాష్ట్రాలన్నీ నాటి ఉమ్మడి తెలుగు రాష్ట్ర జనాభా కన్నా తక్కువ. ఇప్పుడు రెండు రాష్ట్రాలూ కలిపి సుమారు 10 కోట్ల జనాభా ఉన్నారు.

# 35వ వార్డు అధ్యక్షులు లెంక త్రినాథ్ రూ. 5 వేలు విరాళం అందజేత





**విశాఖ, (రాజధాని వార్తలు):** ఈ రోజు వేలంపేట నీలమ్మ తల్లి అమ్మవారి జాతర మహత్సవములు సందర్భంగా వెలంపేట గ్రామ పెద్దలు మరియు నీలమ్మ తల్లి అమ్మవారి ఆలయం కమిటీ పెద్దలు బోను సన్యాసిరావు, మద్ది ప్రభాకర్, రాంబాబు ఆహ్వానం మేరకు 35వ వార్డు అధ్యక్షులు లెంక త్రినాథ్, జనసేన పార్టీ నాయకులు కడవల రఘు, జనసేన పార్టీ నాయకులు బత్తిన సతీష్ వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అమ్మవారి జాతరకి 35వ వార్డు అధ్యక్షులు లెంక త్రినాథ్ 5 వేల రూపాయిలు విరాళం అందించారు.

# ఎలమంచిలిలో బిజెపి 'మన ఊరు - మన జెండా' సందడి

## - భారీ ర్యాలీతో హోరెత్తిన వీధులు









**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు – మన జెండా' కార్యక్రమం ఆదివారం ఎలమంచిలి నియోజక వర్గంలో అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని పట్టణాన్ని కాషాయమయంగా మార్చేశారు. అదేవిధంగా, పట్టణంలోని ధర్మవరంలో కూడా ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా చేపట్టారు.దీనిలో భాగంగా, పార్టీ అభిమానులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు.అలాగే, అనకాపల్లి నియోజకవర్గంలోని ఎలమంచిలి ప్రాంతంలో గల సతకంపట్టు, పెదరామ స్వామి కోవెల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త మరియు బిజెపి నాయకులు ముత్యాల వెంకటేశ్వరావు (ఎం వి ఆర్), పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరావు, బిజెపి మహిళా నాయకురాలు రామకుమారి మరియు ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడం, ప్రతి ఇంటికీ బిజెపి జెండాను, సిద్ధాంతాన్ని చేరవేయడమే ఈ 'మన ఊరు – మన జెండా' కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం ఉధృతంగా సాగింది. అదే విధంగా, ప్రతి జెండా ఆవిష్కరణ పాయింట్ వద్ద పార్టీ సభ్యత్వానికి సంబంధించిన క్యూ ఆర్ కోడ్ (బార్ కోడ్) బోర్డులను ఏర్పాటు చేశారు. తక్షణమే పార్టీలో చేరాలనుకునే వారు తమ మొబైల్ ద్వారా ఈ బార్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నిమిషాల వ్యవధిలోనే అధికారికంగా సభ్యత్వం పొందేలా ఏర్పాట్లు చేశారు. సాంకేతికతను జోడించి చేపట్టిన ఈ ప్రక్రియకు యువత నుండి విశేష స్పందన లభిస్తుంది. ఎం వి ఆర్ ప్రత్యేక చొరవతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుండటంతో బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ పార్టీ నాయకులు గైపూరి రాజు, ఏపూరి వాసులతోపాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు కోరుకొండ వాసు, సత్తి మణికంఠ, గాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అనధికార ప్లాట్లు రెగ్యులైజేషన్‌కు 23వ తేదీ గడువు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో నాధికార లేఔట్‌లో ఉంది ప్లాట్లు కలిగిన యజమానులు వారి యొక్క ప్లాట్లను రెగ్యులర్ చేయించుకొనుటకు ఈనెల 23వ తేదీలోగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాల యం నోటీస్ బోర్డులో సామర్లకోట అంబరు అంబటి వారి తోట సర్వే నెంబర్ 42/1ఏ నందు నాధికారిక లేఅవుట్‌ను గుర్తించినట్లు ఆమె ప్రకటించారు. ఈ అనధికార లేఅవుట్ వివరాలను నోటీస్ బోర్డుతో పాటు మున్సిపల్ వెబ్ సైట్ నందు నమోదు చేసినట్లు చెప్పారు. 15 రోజుల్లో మెయిల్ ద్వారా రాతపూర్వకంగా గాని అనధికారిక లేఅవుట్ పై అభ్యంతరాలు తెలియజేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీపిఓ మంజుల, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొండూరు సుధాకర రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి

**ఇందుకూరు పేట /కోవూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,జాఫర్ కెనాల్ మాజీ చైర్మన్, చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కొండూరు సుధాకర రెడ్డి అనారోగ్యంతో ఇటీవల శివైక్యం చెందగా, ఇందుకూరుపేట మండలం గంగ పట్నం గ్రామంలోని వారి నివాసంలో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించి, వారి కుమారుడు కొండూరు సునీల్ కుమార్ రెడ్డిని వారి కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వరరెడ్డి శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయ కులు పి ఎల్ రావు, ఏకొల్లు పవన్ రెడ్డి, కొండూరు వెంకట రమణారెడ్డి, ఇంటూరు విజయ్, గుండాల కృష్ణారెడ్డి బొద్దుకూరు సుధీర్ జఫ్ఫల్ల మార్బల్ జనార్దన్ గౌడ్



బొద్దుకూరు సుధాకర్ రమేష్ రెడ్డి కంసాని గోపి, రంజాన్, మల్లికార్జున, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు

# అధైర్య పడవద్దు - అండగా ఉంటాం

## - మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** అధైర్య పడవద్దని పార్టీ ఎల్ల వేళలా అండగా ఉంటుందని కొద్ది రోజుల క్రితం అనారోగ్య కారణంగా మృతి చెందిన ఆముదాల వెంకటరమణ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య శనివారం వైకాపా నాయకురాలు సరస్వతి గృహానికి వచ్చి పరామర్శించారు. మనో ధైర్యం కోల్పోవద్దని, పార్టీ ఎల్లవేళలా అండదండగా ఉంటుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, జడ్పిటిసి గార తౌడు, మాజీ సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, వైకాపా నాయకులు కర్రీ రామునాయుడు, రూమ్కాన భాస్కరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు జి.సత్యనారాయణ, కర్రి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌చే "జల సంరక్షణ" ప్రతిజ్ఞ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం మాదవ పట్నం గ్రామపంచాయతీ వద్ద జల సంరక్షణ నిర్మాణానికి (వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్) కు శనివారం భూమి పూజ చేసి జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్ పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆవరణంలో ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మొక్కను నాటారు. అనంతరం అందరి చేత స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం స్ఫూర్తితో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పరచాలన్నారు. కేవలం ఈ ఒక్క రోజు మాత్రమే కాకుండా రోజు పరిశుభ్రతను పాటించడం ద్వారా పారిశుద్ధ్యంలో మార్పు తీసుకు రావచ్చన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలోని చెరువును పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంటరామా పిడిఎస్ మధుసూదన్, ఏపీడీ ఎం భాను ప్రకాష్, సామర్లకోట ఎంపీడీవో కాదా ఉమామహేశ్వరి, గ్రామ నాయకులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# పిఎండిఎస్ విత్తనాల ప్యాకింగ్ పనులను పరిశీలించిన అధికారులు

## - 1600 ఎకరాలకు విత్తనాలు సిద్ధం : జెడిఎ విజయకుమార్



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం వేలంగి రైతు సేవా కేంద్రంలో పిఎండిఎస్‌కి సంబంధించిన విత్తనాల ప్యాకింగ్ పనులను జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పిఎండి ఎస్ సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిం చారు. కరప మండలంలో సుమారు 1600 ఎకరాలకు సరిపడే విత్తనాలను సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. పిఎండిఎస్ కింద 32 రకాల విత్తనాలను వినియోగించడం ద్వారా జీవవైవిధ్యం పెరిగి, నేలలో సేంద్రీయ గర్భం మెరుగవుతుందని విజయకుమార్ చెప్పారు. నేల కోత తగ్గడంతో పాటు, పంటల వేళ్ల ద్వారా పోషకాలు అందుబాటులోకి వచ్చి ప్రధాన పంటైన వరికి మేలు జరుగుతుందని వివరించారు. నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, పచ్చిరొట్ట ద్వారా పశువులకు మేత లభిస్తుందని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గి ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చని ఆయన సూచించారు. అనం తరం యండమూరు గ్రామంలో వరి కోతలను పరిశీలించిన విజయ కుమార్, కోత యంత్రంలో బ్లోయర్ ఆన్‌లో ఉంచితే తాలు గింజలు తగ్గి నాణ్యత మెరుగవుతుందని, తద్వారా మద్దతు ధర పొందవచ్చని చెప్పారు. యంత్రాన్ని వినియోగించే సమయంలో బ్లోయర్ సక్రమంగా పనిచేస్తుందో లేదో రైతులు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరప సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబురావు, మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య, వ్యవసాయ విస్తరణ అధికారి ఎంవీ సతీష్, వీఏఏ ప్రణీత్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటం భామగా అవతారం ఎత్తిన సీతమ్మ



కృతిసనన్ టాలీవుడ్, బాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగులో మహేష్, ప్రభాస్‌లాంటి స్టార్ హీరోల చిత్రాల్లో భాగమైన అమ్మడి కెరీర్ అవి పెద్దగా ఉపయోగ పడలేదు. ఆ రెండు భారీ కాన్వాస్ పై తెరకెక్కిన సినిమాలే అయినా ఫలితాలు మాత్రం నిరాశపరిచాయి. అలాగని అమ్మడు టాలీవుడ్‌కు దూరంగా కాలేదు. ఇక్కడ పరిశ్రమకు టచ్‌లో ఉంటూనే బాలీవుడ్‌లో కూడా దిగ్విజ యంగా కెరీర్‌ను కొనసాగిస్తోంది. అనతి కాలంలోనే జాతీయ ఉత్తమ నటిగా అవార్డు సైతం అందుకుని ఉత్తరాదిన తన ఇమేజ్‌ను అంతకంతకు పెంచుకుంది. ప్రస్తుతం బాలీవుడ్ బిజీ నాయికల్లో తాను కూడా ఒకరు. అదనంగా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటడం అమ్మడి ప్రత్యేకత. ఇలా కమర్శియల్ సినిమాలతో పాటు లీడ్ రోల్స్ పోషిస్తూ బిజీగా ఉంది. తాజాగా ఈ బ్యూటీ కొత్త జర్నీ కూడా మొదలు పెట్టినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరుణ్ ధావన్ హీరోగా నటిస్తోన్నస-హై జవానీతో ఇష్క్ హోనా హై- అనే చిత్రంలో అమ్మడు ఐటం భామగా మెప్పించడానికి రెడీ అయింది. ఇందులో మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే హీరోయిన్లుగా నటిస్తుండగా, ఐటం భామగా మాత్రం కృతి సనన్‌ని ఎంపిక చేసారు. ఈ పాటతో కృతి తనలోని సరికొత్త కోణాన్ని ఆవిష్కరించబోతోంది. ఈ పాట చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని సమాచారం. ఈ పాట షూటింగ్ కోసం చిత్ర బృందం ఓ భారీ సెట్ నిర్మించింది. కృతి లుక్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆమె పోషించిన పాత్రల కంటే ఇది భిన్నంగా, అత్యంత గ్లామరస్‌గా ఉండబోతోందని ఇండస్ట్రీ టాక్. అమ్మడి అభిమానులకు ఇదో పెద్ద సర్ప్రైజ్ అని చెప్పొచ్చు. ఈ స్పెషల్ సాంగ్ గురించి కృతి సనన్ గానీ, సినిమా టీమ్ గానీ ఎక్కడా అధికారికంగా పెదవి విప్పలేదు. అంతా చాలా గోప్యంగా ఉంచుతున్నారు. సినిమా ప్రమోషన్స్ సమయంలో ఈ పాటను సర్ప్రైజ్ ప్యాకేజీగా రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హీరోయిన్లు ఐటం సాంగ్స్ చేయడం ట్రెండ్‌గా మారిన సంగతి తెలిసిందే. సమంత, పూజా హెగ్డే, శ్రుతిఒ హాసన్ వంటి అగ్ర తారలు ఇప్పటికే స్పెషల్ సాంగ్స్‌తో భారీ క్రేజ్ తెచ్చుకున్నారు.

# రాజాసాబ్ దెబ్బకు సైలెంట్ అయిపోయారే..



పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.. టాలీవుడ్లో కొన్నేళ్లుగా ప్రకంపనలు రేపుతున్న నిర్మాణ సంస్థ. ఈ బేనర్లో ముందు ఎక్కువగా చిన్న సినిమాలే నిర్మించిన నిర్మాత టి.జి.విశ్వప్రసాద్.. తర్వాత ఒక్కసారిగా విజృంభించారు. ఒకేసారి రెండంకెల సంఖ్యలో సినిమాలు లైన్లో పెట్టడమే కాక.. పవన్ కళ్యాణ్, ప్రభాస్ లాంటి అగ్ర కథానాయకులను పెట్టి కొన్ని భారీ చిత్రాలను కూడా నిర్మిస్తూ ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారారు విశ్వప్రసాద్. ఒక దశలో పీఎంఎఫ్ బేనర్లో పాతిక సినిమాల దాకా వివిధ దశల్లో ఉన్నాయి.ఎంతో మందికి అవకాశాలు ఇచ్చారు .ఈయన చాలా సినిమాలు తీసి ఎంతో మందికి జీవనోపాధి కల్పించారు. టాలీవుడ్ చరిత్రలోనే ఏ నిర్మాతా ఒకేసారి ఇన్ని సినిమాలు ప్లాన్ చేసింది లేదు. ఇలా ఎలా సాధ్యం అని అందరూ షాకైపోయారు. ఏడాదిలో అయిదారు రిలీజ్‌లతో తరచుగా మీడియాలో కనిపించేవారు విశ్వప్రసాద్. అలాంటి నిర్మాత ఈ జనవరి నుంచి పెద్దగా మీడియాలో కనిపించడం లేదు. ఆయన గురించి వార్తలు లేవు. పీపుల్ మీడియా బేనర్లో కొత్త సినిమాల గురించి కూడా ఎక్కడా చర్చే లేదు. ఇదంతా రాజాసాబ్ సినిమా పుణ్యమే అని చెప్పొచ్చు. పీఎంఎఫ్ బేనర్లో ఎన్నో డిజాస్టర్లు ఉన్నాయి. ఐతే ఆ సినిమాలు కొట్టిన దెబ్బలను నిర్మాత తట్టుకోగలిగారు. కానీ రాజాసాబ్ దెబ్బ మాత్రం గట్టిగానే తగిలినట్లు కనిపిస్తోంది.

ఒక సినిమా ఫెయిలైనా మీడియాలోకి వచ్చి ఏం పర్లేదు అన్నట్లుగా మాట్లాడే విశ్వప్రసాద్.. రాజాసాబ్ తర్వాత మాత్రం కనిపించడం లేదు. తమ బేనర్లో వచ్చిన ఫెయిల్యూర్ల తాలూకు నష్టాలన్నింటినీ రాజాసాబ్ భర్తీ చేసేస్తుందని గతంలో ఆయన ధీమా వ్యక్తం చేశారు. కానీ ఈ సినిమా కొత్తగా భారీ నష్టాలు తెచ్చి పెట్టింది.

# రాజమౌళిని చూసి ఆశ్చర్యపోతున్న టీం



రాజమౌళి ఒకప్పుడు సగటు మాస్ మసాలా సినిమాలు తీసినవాడే. కానీ 'మగధీర' నుంచి ఆయన ప్రయాణం మారిపోయింది. ఆ సినిమాలో ఆయన విజన్ చూసి అందరూ ఒక్కసారిగా షాకైపోయారు. ఆయన సృష్టించిన విజువల్ మాయాజాలానికి ఫిదా అయిపోయారు. ఇలాంటి సినిమాలు తీయడం వెనుక ఉండే కష్టం ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఏళ్ల తరబడి కష్టపడితే తప్ప ఔట్ అంత గొప్పగా రాదు. ఆపై ఈగ, బాహుబలి, బాహుబలి-2, ఆర్ఆర్ఆర్ చిత్రాల్లో రాజమౌళి చూపించిన భారీతనం, చేసిన విజువల్ మాయాజాలం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఔట్‌పుట్ విషయంలో రాజీకి రవ్వంతైనా అవకాశం ఇవ్వడు కాబట్టి రాజమౌళి సినిమాలు ఆలస్యం కావడం అన్నది మామూలైపోయింది. ఆయన సినిమాల షూటింగ్ షెడ్యూల్స్ తారుమారు అయిపోతుంటాయి. చెప్పిన డేటుకు సినిమాలు రిలీజ్ కావు. వీటన్నింటికీ ఆయనతో పని చేసేవాళ్లే కాదు.. ప్రేక్షకులు కూడా అలవాటు పడిపోయారు. జక్కన్న కొత్త సినిమా 'వారణాసి' కూడా ఆటోమేటిగ్గా ఆలస్యం అవుతుందని.. చెప్పిన డేటుకు రావడం సందేహమే అనే అభిప్రాయంతోనే చాలామంది ఉన్నారు. కానీ 'వారణాసి' షూటింగ్ నడుస్తున్న తీరు చూసి.. టీం అంతా ఆశ్చర్యపోతోందట. ఈ మూవీ షూటింగ్ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిపోతోందట. ఇటీవల ఒక నెల రోజుల పాటు హైదరాబాద్‌లో వేసిన స్పెషల్ సెట్లో కీలక సన్నివేశాల షూటింగ్ జరిపిన టీం.. ఇప్పుడు మరో సెట్లో ఓ పాట చిత్రీకరణకు రెడీ అవుతున్నట్లు సమాచారం. ముందు అనుకున్న ప్రకారమే ఆగస్టుకల్లా షూట్ పూర్తి చేసే దిశగా టీం అడుగులు వేస్తోందట. ఇప్పటికే షూట్ 70 శాతం దాకా అయిపోయినట్లు సమాచారం.

మరోవైపు సమాంతరంగా విజువల్ ఎఫెక్ట్స్ పనులు జరుగుతున్నాయి. షూట్ ముగిశాక ఆరేడు నెలల పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతాయి. అదే సమయంలో ప్రమోషన్ కూడా నడుస్తుంది. ఇప్పటిదాకా అంతా అనుకున్న ప్రకారమే జరుగుతోంది. ఇకముందూ అలాగే ఉంటే.. చెప్పినట్లే ఏప్రిల్ 7కు ఈ సినిమా రిలీజ్ కావడం పక్కా. రాజమౌళితో ఎన్నో ఏళ్లుగా కలిసి పని చేస్తూ ఆలస్యాలకు, వాయిదాలకు అలవాటు పడిపోయిన ఆయన టీం సభ్యులు.. ఈసారి అన్నీ ప్రణాళిక ప్రకారం జరిగిపోతుం డడం చూసి ఆశ్చర్యపోతున్నారట. మరి రిలీజ్ వరకు ఇదే టెంపోను జక్కన్న మెయింటైన్ చేస్తారేమో చూడాలి.

# ఆ ఇద్దరి భామల నయా స్ట్రాటజీ!





హీరోయిన్ల పాత్రల్లో ఎన్నో రకాల మార్పులు చోటు చుసుకుంటున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ అంటే కేవలం పెద్ద సినిమాల్లో గ్లామర్ కోసమో? పాటల కోసమో? అనే భావన ఉండేది. కానీ దీపికా పదుకోణే, రష్మికా మందన్నా వంటి అగ్ర కథానాయికలు ఆ మూస పద్ధతిని తాజాగా చెరిపేస్తున్నట్లే కనిపిస్తుంది. కెరీర్ ప్లానింగ్‌లో భారీ కమర్షియల్ చిత్రా లతో పాటు కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సరికొత్త వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. దీపికా పదుకోణే కెరీర్‌ను గమనిస్తే కమర్శియల్ పాత్రలకు పూర్తిగా దూరం కాకుండా తెలివైన ఆట ఆడుతోంది. ఓవైపు ఆ తరహా పాత్రలకు కమిట్ అవుతూనే మరోవైపు గెహ్రాయియాన్, పద్మావత్ వంటి ప్రయోగాత్మక చిత్రాల్లోనూ సత్తా చాటిన సంగతి తెలిసిందే. స్టార్ హీరోల సరసనే కాకుండా కథను మలుపు తిప్పే బలమైన పాత్రల కోసం దీపిక ఫోకస్ చేసి పని చేస్తోంది. ఇది అమ్మడి మార్కెట్ విలువను పెంచడమే కాదు. నటిగా ఆమెలోని విలక్షణతను ప్రపంచానికి చాటి చెబుతోంది. టాలీవుడ్ సంచలనం రష్మిక మందన్నా కూడా ఇదే బాటలో నడుస్తోంది. పుష్ప వంటి కమర్షియల్ సక్సెస్‌ల తర్వాత ఆమె కేవలం భారీ చిత్రాలకే పరిమితం కాకుండా మైసావంటి యాక్షన్ ఓరియెంటెడ్ రోల్స్, చిన్న సినిమాల్లోనూ నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలకు కమిట్ అవుతోంది. గ్లామర్ కంటే పర్ఫార్మెన్స్‌కే ఎక్కువ మార్కులు పడతాయని గ్రహించిన రష్మిక విభిన్నమైన జోనర్లను ప్రయత్నిస్తోంది. అలా అమ్మడు తన ఇమేజ్‌ను మార్చుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్మికకు అన్ని భాషల ప్రేక్షకులలో ఆదరణ పెరుగుతోంది. ఈ నయా స్ట్రాటజీ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం లాంగ్ కెరీర్. గ్లామర్ అనేది ఒక వయసు వరకే పరిమితం. కానీ నటన అనేది దశాబ్దాల పాటు గుర్తింపును ఇస్తుందని నేటి తరం హీరోయిన్లు నమ్ముతున్నారు. చిన్న సినిమాల్లో నటించడం వల్ల నటిగా వారి ప్రతిభకు పదును పెట్టడమే కాదు. కొత్త దర్శకులకు అండగా నిలిచినట్లు అవుతుంది. దీంతో పరిశ్రమలో వారి గౌరవం పెరుగుతుంది. అలాగే ఓటీటీ విప్లవం కూడా హీరోయిన్ల ఆలోచనా విధానంలో మార్పు తెచ్చిందన్నది కాదనలేని నిజం. పెద్ద సినిమాల్లో అతిథి పాత్రల కంటే చిన్న సినిమాల్లో, వెబ్ సిరీస్‌లలో లీడ్ రోల్స్ వచ్చే గుర్తింపుతో మంచి అవకాశాలు ఒడిసి పట్టుకుంటున్నారు. బాక్సాఫీస్ లెక్కల కంటే ప్రేక్షకులు కంటెంట్‌కే పట్టం కడుతున్నారు. అందుకే స్టార్ హోదా ఉన్నా రిస్క్ తీసుకొని విభిన్నమైన కథలను ఎంచుకోవడం హీరోయిన్ల ధైర్యానికి దూరదృష్టికి నిదర్శనం. దీపికా పదుకొణే, రష్మికా మందన్నా? వంటి భామలు సృష్టిస్తోన్న ఈ ట్రెండ్ రాబోయే తరం హీరోయిన్లకు దిక్సూ చిలా మారుతోంది. గ్లామర్ అనేది అలంకారం మాత్రమేనని అసలైన బలం నటనలోనే ఉందని ఈ భామలు నిరూపిస్తున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు స్టేట్ ఫస్ట్

**- అధ్యాపకులు, విద్యార్థులను అభినందించిన కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి**
**- అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం - సప్లిమెంటరీలో 100% ఉత్తీర్ణతే లక్ష్యం - విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి - రాబోయే విద్యా సంవత్సరానికి వినూత్న విద్యా ప్రణాళిక సిద్ధమన్న కలెక్టర్**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ఫలితాల కొరకు కృషిచేసిన అధ్యాపకులు, విద్యార్థులను కలెక్టర్ పిలిచి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల కఠిన శ్రమ, అధ్యాపకుల నిరంతర కృషి వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని కొనియాడారు. కాలేజీల వారీగా ఉత్తీర్ణత శాతంపై నివేదిక రూపొందించాలని, ఫెయిల్ అయిన విద్యార్థుల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి, ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా సప్లిమెంటరీలో 100% ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రతి అధ్యాపకుడు కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకుని 'మెంటార్'గా వ్యవహరించాలని, వారి కుటుంబ నేపథ్యాన్ని అర్థం చేసుకుని మానసిక ధైర్యం కల్పించాలని సూచించారు. విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాల వైపు మళ్లాలని, కనీసం నెలకు లక్ష రూపాయలు సంపాదించే స్థాయికి ఎదగాలని, అప్పటి వరకు వివాహాల జోలికి వెళ్లకుండా చదువుపైనే దృష్టి సారించేలా ప్రోత్సహించాలని కోరారు. ఇంటర్ తదుపరి డిగ్రీలో విద్యార్థులు చేరేలా వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటర్ తరువాత కెరీర్ కు అవసరమయ్యే సూచనలు, సలహాలు కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశామని, ఆ నెంబర్లు ప్రతీ విద్యార్థి వద్ద ఉండాలని స్పష్టం చేశారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేసి, విద్యార్థులను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే హార్వర్డ్, ఎంఐటి వంటి ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలలో 100% స్కాలర్‌షిప్‌లతో సీట్లు పొందేలా అవగాహన కల్పించాలని, ఇందుకోసం 'శాట్' మరియు ఐఐటి కోచింగ్‌లను ప్రారంభించాలని సూచించారు. కళాశాల క్యాంపస్‌లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, విద్యార్థుల అనారోగ్య సమస్యలను గుర్తించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అధ్యాపకులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటూ, డ్రాపౌట్స్ లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ కళాశాలలు, కేజీబీవీల్లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు, అలాగే వారిని ఆ స్థాయికి కృషిచేసిన అధ్యాపకులను కలెక్టర్ ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై. నాగేశ్వరరావు, వివిధ ప్రభుత్వ కళాశాలలు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మక్కువ ప్రధాన రహదారి విస్తరణలో పారదర్శకత పాటించాలి

**- ప్రభుత్వ స్థలం మొత్తం 100 అడుగులు స్వాధీనం చేసుకోవాలి**
**- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్**

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండల కేంద్రంలో జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులను పారదర్శకంగా చేయాలని, చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలని ,ఆటో వర్కర్లకు ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి. గంగు నాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రం మక్కువలో నిరసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కువ మండల ప్రధాన రహదారి వెడల్పు కార్యక్రమం పారదర్శకంగా జరగడంలేదని,అధికార పార్టీ తన సొంత వ్యవహారములా చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణలను మినహాయించి ఉన్నదాంట్లో రోడ్డు వేస్తూ ఉండడం విడ్డూరంగా ఉంది. మక్కువ మజ్జి గౌరమ్మ కోవెల నుండి మెయిన్ రోడ్ మీదుగా సువర్ణముఖి నది వరకు 100 అడుగులు ప్రభుత్వం రోడ్డు కోసం కొనుగోలు చేసి అనేక సంవత్సరాలు అవుతున్న ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిమ్మక నీరొత్తునట్టు పెత్తందారులకు దారాదత్తం చేశారని, చిరు వ్యాపారులకు అన్యాయం చేస్తున్నారన్నారు.రహదారి వెడల్పు కార్యక్రమంలో కూడా అధికార పార్టీ నాయకులు ప్రలోభాలకు గురై 100 అడుగులు ఉన్న ప్రభుత్వ స్థలంలో 80 అడుగులు మాత్రమే రోడ్డు వెడల్పు కార్యక్రమానికి ఉపయోగించి మిగిలిన 20 అడుగులు కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది పెత్తందారులకు దారాదత్తం చేయడం దౌర్భాగ్యమన్నారు. మక్కువ- చెముడు మెయిన్ రోడ్డు జంక్షన్ నుండి సువర్ణముఖి నది వంతెన వరకు జరుగుతున్న రహదారి విస్తరణలో 100 అడుగుల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులకు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రత్యామ్నాయ అవకాశం కల్పించాలని కోరారు. మక్కువ మండల కేంద్రంలో సుమారు 150 మంది ఆటోలు నడుపుకొని జీవనం సాగిస్తున్నారని ఆటోలు రోడ్డుపై నిలుపుదల చేసుకుంటే ప్రతిరోజు షాపు యజమానుల నుండి పోలీసుల నుండి వేధింపులు గురవుతున్నారని కాబట్టి ఆటోలు పెట్టుకునేందుకు ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలని, అలాగే అనేకమంది దళితులు, మహిళలు పండ్ల వ్యాపారం, చేపల వ్యాపారం, చేసుకుంటూ ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మక్కువ ప్రధాన రహదారి వద్దే గడుపుతుంటారని వీరికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి దగ్గర్లో ఎటువంటి సౌకర్యాలు లేవని అనేక వ్యాధులకు గురవుతున్నారని కాబట్టి ప్రధాన రహదారికి ఆనుకొని ప్రజా వినియోగ మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు కాకుండా అధికార పార్టీ నాయకులే అధికారుల వలె వ్యవహరిస్తూ వెడల్పు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఆర్ అండ్ బి, రెవిన్యూ శాఖ అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, స్థానిక మంత్రిగారు కలుగజేసుకొని ప్రభుత్వ స్థలం దుర్వినియోగం కాకుండా మొత్తం 100 అడుగులు స్వాధీనపరచుకోవాలని ఆ స్థలాల్లో చిరు వ్యాపారులకు న్యాయం చూపాలని, ఆటో వర్కర్లకు ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని, పబ్లిక్ మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ఈ నెల 21న స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తాడంగి ప్రభాకర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, రామ్మూర్తి గోపాలరావు, ఆదినారాయణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.



# పట్టుదలతో చదివితే గ్రామీణ విద్యార్థులు అద్భుతాలు చేస్తారు

**- ఇంటర్ టాపర్‌ను అభినందించిన మంత్రి కొండపల్లి**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే అద్భుతాలు సాధిస్తారని.. అందుకు విద్యార్థి రెడ్డి తేజస్విని నిదర్శనం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన రెడ్డి తేజస్విని 1000 కు 991 మార్కులతో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. గొట్లాం గాయత్రి జూనియర్ కళాశాలలో చదివిన తేజస్విని ఎంపీసీ విభాగంలో ఈ మార్కులు సాధించారు. ఈ క్రమంలోనే శనివారం తేజస్విని తన తల్లిదండ్రులతో కలిసి మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి తేజస్వినికి సాలువా కప్పి అభినందించడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గాయత్రి తల్లిదండ్రులతో పాటు కళాశాల అధ్యాపకులకు కూడా మంత్రి అభినందనలు తెలిపారు.

# ద్వారకాతిరుమలలో చిన్న శ్రీను కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం





**ద్వారకాతిరుమల, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తన సతీమణి మజ్జి పుష్పాంజలితో కలిసి ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి)లో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో దర్శించు కున్నారు. ఆలయానికి విచ్చేసిన చిన్న శ్రీను దంపతులకు ఆలయ అధికారులు సాంప్రదాయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న వారు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.
ఈ సందర్భంగా చిన్న శ్రీను స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను ప్రజలందరికీ సుఖశాంతులు, సుభిక్షం కలగాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

**- ఏ.ఎం.సీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, జడ్పిటిసి గార తవుడు**






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడిలో చేర్పించాలని జడ్పిటిసి గార తవుడు, ఏఎంసీ చైర్మన్ పీవీవి గోపాలరాజు పిలుపునిచ్చారు. బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులతో స్థానిక గర్ల్స్ హై స్కూల్ నుంచి మెంటాడ రోడ్డు, జాతీయ రహదారి మీదుగా పాత ఎంపీడీవో కార్యాలయం జూనియర్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. ర్యాలీ ఆద్యంతశీ నినాదాలు చేశారు. ఇందులో భాగంగా ఆరో తరగతిలో ప్రవేశం కొరకు 8 మంది విద్యార్థునీలను ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో జాయిన్ చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివి గోపాలరాజు, జడ్పిటిసి గార తౌడు, ఎంపీడీవో బి.కళ్యాణి, ఎంఈవోలు ఎస్.విమలమ్మ, సాయి చక్రధర్, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్, మీసాల వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎండీవోలు డోల శంకర్రావు, వెంకటరమణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం

**- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ఏ.వి.రమణ**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గజపతినగరం సీ.ఐ జి.ఏ.వి రమణ గజపతినగరంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మహిళా సాధికారకత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళల పట్ల జరుగుతున్న లైంగిక దాడులు, గృహహింస, చిన్నపిల్లల పట్ల జరుగుతున్న అకృత్యాలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు గురించి అవగాహన ఏర్పరుస్తూ, వాటి నివారణకై తీసుకోవాల్సిన చర్యలు గురించి అంగన్వాడి టీచర్స్, డ్వాక్రా మహిళలు, స్టూడెంట్స్, మహిళా పోలీసులకు సి.ఐ జి.ఏ.వి.రమణ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి వివరించారు. ముఖ్య అతిథిగా గజపతినగరం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, గజపతినగరం ఎస్.ఐ కిరణ్ కుమార్ నాయుడు, బొండపల్లి ఎస్.ఐ యు మహేష్, డిప్యూటీ తాసిల్దార్ కె.జోగి నాయుడు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ జగదీష్, గైనకాలజిస్ట్ అరుణ కుమారి, చైల్డ్ వెల్ఫేర్‌కి సంబంధించి సిడిపిఓ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల (5వ ఏపీ కప్) పోస్టర్‌ను గోవా గవర్నర్ అశోక్ గజపతి దంపతులు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్, తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, స్టేట్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావులు మీడియాతో మాట్లాడుతూ మే నెల 5, 6, 7 తేదీలల్లో విజయనగరం రాజీవ్ స్టేడీయంలో ఈ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలిచిన వాళ్ళు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, టిడిపి నాయకులు అవనాపు విజయ్, బొద్దల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వేమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీడీపి నేత బూలోకం విజయకుమార్





**కొడవలూరు/నెల్లూరు, (రాజధాని వార్తలు):** తన జీవితములో విపిఆర్ అంతటి సేవాతత్పర్యుడు లేరని, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను తెలుపుతున్నట్లు టీడీపి సీనియర్ నేత బూలోకం విజయ్ చెప్పారు. ఎంపీగా ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేగా ప్రశాంతి రెడ్డిలు, గల్లీ నుండి ఢిల్లీ వరకు ప్రజలు వాణిని వినిపించి ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ నిరంతరం ప్రజలు పక్షాన నిలబడు తున్న వేమిరెడ్డి దంపతులకు తాను ప్రత్యేక కృతజ్ఞతలు బొకే ద్వారా తెలిపారు.

# విపిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చలివేంద్రం ప్రారంభం చేసిన తిరుమూరు





**కోవూరు, (రాజధాని వార్తలు):** పోతిరెడ్డిపాలెం గ్రామం సాలు చింతలలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వెంకయ్య స్వామి సెంటర్ నందు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులైన తిరుమూరు అశోక్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సం దర్బంగా జొన్నవాడ ఆలయ చైర్మెన్ తిరుమూరు అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ ఉత్తమ సేవలను ప్రజలకు చెయ్యడం ఒక వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యద్దలపూడి నాగరాజు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు హైటెక్ రమణరెడ్డి, మైనార్టీ సోదరులు ఈ కార్యక్రమానికి జయప్రదం చేసారు.

# వ్యర్థాలు కనుకొనడానికి అధునాతన పరికరాలు

## - ఏ పి ఈ ఎల్ సి ఎల్ రాష్ట్ర చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పొల్యూషన్ కాకుండా ముందస్తు చర్యగా వ్యర్థపదార్థాలు ద్వారా ఏర్పడే వ్యర్థాలు నిర్వహణకు ఎలక్ట్రానిక్ ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఏపిఈసిఎల్ రాష్ట్ర చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. 3వ రోజు పర్యటనలో భాగంగా శనివారం చిప్పడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. దివిస్ ల్యాబోరేటరీస్ వారి ఆధ్వర్యంలో నారా చంద్రబాబు 9 మేరకు నిర్వహిస్తున్న "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతోందని అన్నారు. ఈ కార్యక్ర మంలో భాగంగా స్కూల్ యాజమాన్యం, పరిశ్రమ ప్రతినిధులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు కలిసి గ్రామంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అనంతరం దివిస్ లాబొరేటరీస్ జజుల్లా ప్లాంట్‌ను సందర్శించి, వ్యర్థ జలాల శుద్ధి విధానాలను పరిశీలించారు. ఏపిఇఎంసిఎల్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్వేర్/యాప్ ద్వారా పరిశ్రమల నుండి వస్తున్న వ్యర్థాల పరిమాణం (మాని ఫెస్ట్) ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు అవుతున్నదా



అనే అం శాన్ని పరిశీలించాను. వ్యర్థాలను తరలించే వాహనాలపై అమర్చిన జిపిఎస్ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా అని తనిఖీ చేసి, అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చాను. సముద్రంలో విడుదల చేసే వ్యర్థాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి, అవి పూర్తిగా శుద్ధి చేసి పర్యావరణానికి హాని కలగకుండా విడుదల చేస్తున్నారో ప్రత్యక్షంగా పరిశీలించారు.

# ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వేద పండితుల ఆశీర్వాదం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సింహపురి నేత, అభివృద్ధి ప్రదాత, సేవా తత్పరులు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా వేదపండితులు ఆశీర్వదించారు. వేదమంత్రోచ్చరణల మధ్య నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు వేదాశీర్వాదం అందజేశారు.
నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజా సేవలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# రక్తదానంతో మరొకరికి పునర్జన్మ

## - తాను పుట్టిన రోజున సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించడం సంతోషకరం
## - జిపిఆర్ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ప్రారంభించిన వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు జి.పి.ఆర్ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీ వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు రక్తదాన శిబిర నిర్వాహకులు గుడి హరికుమార్ రెడ్డిని అభినందించారు. రక్తదానం చేసినవారిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా తాను పుట్టిన రోజున ఆడంబరాలకు దూరంగా హరికుమార్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. క్యాంప్‌లో పాల్గొన్న నారాయణ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్, నోవా, ప్రభుత్వ ఆసుపత్రివారికి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం అనేది ప్రాణాన్ని కాపాడే గొప్ప కార్యం. మనం ఇచ్చే రక్తం.. మరో ముగ్గురి జీవితాన్ని నిలబెడుతుందన్నారు. గత సంవత్సరం ఇదే రోజున తన పుట్టిన రోజున జరిగిన బ్లడ్ క్యాంపులో దాదాపు 1500 యూనిట్లు రక్తదానం చేశారన్నారు. అవి కొన్ని నెలల వరకు ప్రజలకు ఉపయోగపడ్డాయని చెప్పారు. ఇప్పుడు కూడా దాదాపు 750 యూనిట్లు సేకరించనున్నారని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ దాతలిచ్చే ఒక బాటిల్ రక్తం ప్రమాద బాధితులకు, ప్రసవ సమయంలో తల్లులకు, తలసేమియా మరియు క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు కొత్త జీవితాన్ని ఇస్తుందన్నారు. రక్తదానం చేస్తే బలహీనపడతామనేది అపోహ మాత్రమేనని రక్తం ఇచ్చిన వెంటనే శరీరం కొత్త రక్త కణాలను వేగంగా ఉత్పత్తి చేస్తుంది, దీనివల్ల దాతలు మరింత చురుగ్గా మారుతారన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పైగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. నోవా బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ మరియు జి.జి.హెచ్ బ్లడ్ బ్యాంక్ బృందాలు రక్త సేకరణలో పాల్గొన్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రక్తదాతలను ప్రత్యక్షంగా కలిసి వారిని అభినందించారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు గుడి హరికుమార్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపి కూటమి, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# విపిఆర్ జన్మదినం రోజున మహిళా సాధికారతకు పెద్దపీట

## - వి పి ఆర్ నూతన క్యాంపు కార్యాలయం ప్రారంభం - కోవూరు మహిళలకు కుట్టు మిషన్లను, తోపుడు బండ్ల పంపిణీ - స్వయం ఉపాధితో కుటుంబాలకు ఊతం - హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు.. విపిఆర్ చల్లగా ఉండాలని ఆకాంక్ష





**నెల్లూరు /కోవూరు, (రాజధాని వార్తలు):** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలోనూ, సమాజ సేవలోనూ తమదైన ముద్ర వేసిన వేమిరెడ్డి దంపతులు మరోసారి తమ దాతృత్వాన్ని, పలు సేవలను చాటుకున్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నెల్లూరు నగరంలోని విపిఆర్ నూతన క్యాంప్ కార్యాలయంలో భారీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళకు స్వయం ఉపాధి కల్పించే దిశగా వేమి రెడ్డి దంపతులు ఈ వేడుకలను మహిళా సాధికారతకు వేదికగా మార్చారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని 110 మంది మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లను అందజేశారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే 17 మంది పేదలకు తోపుడు బండ్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిల చేతుల మీదుగా అందచేశారు. నిరుపేదల కష్టాలను గుర్తించి వారి కాళ్ళ మీద వారు నిలబడేలా ఉపాధి కల్పించిన వేమిరెడ్డి దంపతులకు కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా ఆశీర్వదించారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా జన్మదిన వేడుకలను నిర్వ హించడమే కాకుండా మహిళా సాధికారతే లక్ష్యంగా తమ దాతృ త్వాన్ని చాటుకున్న వేమిరెడ్డి దంపతుల సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని నియోజకవర్గం టీడీపి అధ్యక్షులు, ప్రముఖ కూటమి నేతలు, కోవూరు నియోజక వర్గం నుండి టీడీపి సీనియర్ నేతలు బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి, కోవూరు నుండి కొల్లా సుధాకర్ రెడ్డి, బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్‌రావు, మాజీ సర్పంచ్ సమాధి శ్రీనివా సులు కృష్ణవేణి తదితరులు, దంపతులు ఇంతా మల్లారెడ్డి, ఇనమడుగు పెంచలయ్య, విన్నకోట రాఖీ, చెముకులు చైతన్య, ఎల్లంపల్లి డిలీప్ కుమార్, తదితరులు కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వీపీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. నగరంలోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

## - "జల సంరక్షణ" నినాదంతో ప్రతిజ్ఞ - గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

**కరప, (రాజధాని వార్తలు):** కరప మండల గ్రామాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. "జలం జీవం" అనే నినాదంతో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి, పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. కరప గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో జై శ్రీనివాస్, నడగుదురు ప్రత్యేక అధికారిగా ఎస్.శ్రీనివాసరావు, సిరిపురం ప్రత్యేక అధికారిగా ఎల్.బి.నరసింహం తమ తమ గ్రామాల్లో కార్యక్రమాలను పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం, ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడంపై ప్రజలకు, వ్యాపార దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. కరప గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి జటావల్ల భుల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నీటి వనరుల పరిరక్షణలో భాగంగా కరప సిపాయి చెరువు వద్ద శుభ్రత చర్యలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, కె వారిజ, డి.దుర్గభవాని, ఎం.శివరామకృష్ణ (ఎఫ్ఏసీ), ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీ వో ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వర్ధన్, అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు, కూటమి నాయకులు భోగిరెడ్డి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ పేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# వెల్లువెత్తిన ఆనందం.. ఉప్పొంగిన అభిమానం

**- పండుగలా విపిఆర్ జన్మదిన వేడుకలు - అభిమాన నాయకుడికి అభినందనల వెల్లువ - విపిఆర్ క్యాంప్ కార్యాలయానికి పోటెత్తిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు - జై విపిఆర్ నినాదాలతో మార్మోగిన ప్రాంగణం - కేక్ కటింగులతో, గజ మాలలతో విపిఆర్ దంపతులకు సన్మానాలు**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దానగుణ సంపన్నులు, జిల్లా అభివృద్ధి సాధకులు, పేద ప్రజల ఆశాజ్యోతి..నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి. ఎంపికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లా నలు మూలల నుంచి రాజకీయ ప్రముఖులు, కార్యకర్తలు, అభిమా నులు భారీగా తరలి రావడంతో నెల్లూరులోని విపిఆర్ క్యాంప్ కార్యాలయం జనసందోహంగా మారింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగర మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జడ్పీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు రెడ్డి, జనసేన జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ వంటి వారితో పాటు ఇతర ప్రముఖులు, వివిధ అసోసియేషన్ ప్రతినిధులు విపిఆర్‌ని కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. నెల్లూరు సిటీ, రూరల్, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు మరియు కోవూరు నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం, జనసేన మరియు బిజెపి ముఖ్య నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మరియు మార్కెటింగ్ కమిటీ చైర్మన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమాన నాయకుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. దాంతో కార్యాలయం ప్రాంగణమంతా జై విపిఆర్, విపిఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలతో దద్దరిల్లింది. కేవలం రాజకీయ నేతలే కాకుండా, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు స్వయంగా తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, వేమిరెడ్డికి ఆశీర్వచనాలు అందజేశారు. వేలాదిగా తరలి వచ్చిన నాయకులు, అభిమానుల కోలాహలంతో విపిఆర్ క్యాంప్ కార్యాలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.

# ఘనంగా అమోఘా రెస్టారెంట్ ప్రారంభం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక పార్థసారథి నగర్ మెయిన్ రోడ్‌లో హోటల్ అమోఘా రెస్టారెంట్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ మంచి హోటల్ను ఏర్పాటు చేశారని నిర్వాహకులు కొండూరు ప్రవీణ్ ను అభినందించారు. హోటల్ విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు ప్రవీణ్, భరత్ కుమార్‌లపై మాట్లాడుతూ నెల్లూరు నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వెజ్, నాన్ వెజ్ వంటకాలను అందుబాటులోకి తీసుకొని వచ్చామన్నారు. ప్రారంభం సందర్భంగా ఆఫర్లను కూడా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఊటుకూరు దత్తాత్రేయ, కుంచాల విజయభాస్కర్, పంత్రంగి అజయ్ బాబు, వల్లెపూ బాబు, కేశవ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా విపిఆర్ జన్మదిన వేడుకలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భారీ స్థాయిలో తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో విపిఆర్ కార్యాలయం కిక్కిరిసింది. నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ భారీ గజమాలతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యే ప్రశాం తమ్మను ఘనంగా సత్కరించారు. వేమిరెడ్డి దంపతులతో భారీ కేకు కట్ చేయించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు ప్రతీకగా.. వేద పడితులు, ముస్లింలు, పాస్టర్లతో ప్రత్యేక ప్రార్థనలు చేయించి ఆశీర్వాదాలు అందజేశారు. అభివృద్ధిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాత్ర, ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలని ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ కొని యాడారు. ప్రజా సేవకు పర్యాయపదంలాంటి ఎంపీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జై విపిఆర్ నినాదాలతో ప్రాంగణం మార్మోగిపోయింది.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan